

# కొండఫలం

వాడ్రేవు వీరలక్ష్మీదేవి

"ఆ తోట చూపిస్తేనేగాని కథ చెప్పవా?" అంది పద్మిని.

"ఇదిగో! నాలుగు అడుగులు," అంటూనే మరో వంద అడుగులు నడిపించాను. అంత దూరం నించీ జీడిమామిడి పూల సువాసన స్వాగతం పలుకుతూ ఉంది. మత్తెక్కించే లాంటి సువాసన ఆ పూలది.

అందుకేనేమో ఆపప్పు అంత రుచిగా ఉంటుంది.

"అబ్బ! ఎంత పరిమళం! ఎక్కడనించీ!" అని పూలు చూసి ఆశ్చర్యపోయింది. "పూలకి ఇంత సువాసనా! నాకు ఇంత కాలమూ తెలియనే తెలియదు," అని ఆశ్చర్యంతో, వీలుగా ఉన్న ఒక రాతిబండ మీద కూర్చుంది.

పద్మిని ఈ ఉదయమే వచ్చింది. నాకు మంచి మిత్రురాలు. యూనివర్శిటిలో రీడరుగా పనిచేస్తుంది. గిరిజన సమస్యల మీద రీసెర్చ్ చేసింది. ఇప్పుడు గిరిజనుల భూమి సమస్య మీద యు.జి.సి.కి ప్రాజెక్ట్ వర్క్ చెయ్యాలిట. దానికోసం నా దగ్గరకి వచ్చింది.

"ఇక్కడ గిరిజనేతరులు గిరిజనుల భూములు ఆక్రమించుకొని వాళ్లని దిక్కులేనివాళ్లని చేసి వీళ్లు ధనవంతులయిపోతున్నారట కదా! ఆ వివరాలు నీవేమయినా చెప్పగలవా?" అని అడిగింది ఉదయమే నన్ను.

"సాయంత్రం నీకో కథ చెప్తాను. తర్వాత నువ్వే నీ వర్క్ పూర్తి చేసుకోగలవు," అని ఈ సాయంత్రం ఇక్కడికి తీసుకువచ్చాను.

తోట నిండా జీడిమామిడి చెట్లు విరగబూసి వున్నాయి. ఈ ఏడు బ్రహ్మాండమైన కాపు వస్తుంది. మొక్కలు చెట్లయ్యాయి. ఇక వీటికి నీరు పొయ్యక్కర లేదు.

ఈ జీడిమామిడి పూల గాలిలోంచి ఒక వగరుతో కూడిన చేదువాసన నా ముక్కుపుటాలను తాకుతున్న అనుభూతి నాకు.

"ఏదీ! కథ మొదలుపెట్టు," అన్న పద్మిని మాటతో అంతా గుర్తు చేసుకొన్నాను.

*

ఒకనాడు సీతాలు పొద్దున్నే ఏడుస్తూ వచ్చి వాకిట్లో నిలబడింది. చేస్తున్న పని మధ్యలో ఆపి అరుగుమీంచే అడిగాను.

"ఎందుకే అలాగవుతున్నావు. ఏం జరిగింది" అని.

చిన్న పాకహోటల్‌లో పొద్దున్నే ఇడ్లీ, టీ అమ్ముతూ బతుకు గడుపుకొచ్చే సీతాలుకి నేను ఖాతాదార్ని. ఉదయమే ప్రతిరోజూ నాకు వేడివేడి ఇడ్లీలు పంపుతుంది.

అడవి మధ్యలో ఉన్న ఈ పల్లెటూరి రోడ్డు మీద రోజుకి పదిసార్లు ఆర్టీసీ బస్సులు, ఓ డజను బేంబూ లారీలు తప్ప మరేవీ తిరగవు. వీటిని నమ్ముకొన్న ఆ పాక హోటల్ అనే బడ్డీ రోజుకి పదిహేను రూపాయలు లాభం మిగిల్చితే పండగే. ఇడ్లీలు, టీ మాత్రం మిగిలి పోతుంటాయి.

అయినా సీతాలు చిరునవ్వుతో ఉంటుంది. నూనె రాసినా ఎంతకీ అణగని నొక్కుల జుట్టుతో ఈ కొండకాపు యువతి తన యౌవనాన్ని గంగరాజనే యువకుడికి ధారపోసింది. ప్రస్తుతం గంగరాజు సీతాలుని చేరదీశాడని, ఉంచుకొన్నాడని, ఆ చిన్న పల్లెటూళ్లో చెప్పుకొంటారు.

అయినా సీతాలు చిరునవ్వుతోనే ఉంటుంది. అలాంటి సీతాలు ఉదయమే ఏడుస్తూ నుంచుంది. సమాధానంగా చేతిలో కాయితం నాకిచ్చింది. అరుగు మీదకి రమ్మని, నేనూ ఆ కాయితం చదువుతూ కింద చతికిలబడ్డాను.

అది గవర్నమెంటువారు సీతాలు పేర పంపిన కోర్టు నోటీసు. గవర్నమెంటు వారిచ్చిన అయిదెకరాల పట్టాభూమి హరిజనవాడలోని ఫకీర్రావుకి చెందినది కాబట్టి అతను పెట్టుకొన్న అర్జీని అనుసరించి ఆ భూమిని ట్రైబల్ కోర్టు అతనికి అప్పజెపుతున్నట్టు సారాంశం. ఫలానారోజు నిర్వహించే కోర్టులో ఈ వ్యవహారం జరుగుతుందని దాన్లో ఉంది. ఇదంతా చదివాక నాకు ఒక అనుమానం వచ్చింది. "ఇది చదవకుండానే నీకు ఇందులో సంగతి ఎలా తెలిసిందే? ఏడుస్తున్నావు," అన్నాను.

"పొద్దున్నే ఆ ఫకీర్రావుగాడొచ్చి ఈ కాయితం నా మొహాన ఇసిరి సంగతి చెప్పిపోయాడు తల్లీ. గంగరాజు గాడు ఇది సూడ్డమేంటి, ఎంటనే నన్ను ఒంగదీసి నా యీపు మీద గుద్దేసినాడు. 'దరిద్రపు మొకమా! ఆ అయిదెకరాల ముక్క మీద నా కట్టమంతా పెట్టాను. ఫో. పోయి ఆ పంతులమ్మకి చెప్పిరా,' అని ఇలా తరిమాడమ్మా నన్ను," అంది.

అయిదారేళ్లుగా వీళ్లిద్దరూ కలిసి ఆ మడిచెక్కని బాగు చేసుకు రావడం ఊరందరికీ తెలుసు. జీడి మామిడి మొక్కలు పాతి వాగులోంచి నీళ్లు మోసి వాటిని కష్టంతో పెంచుకొచ్చారు. అవి చెట్లయి ఈ ఏడే కాపు కొచ్చాయి. అమ్మితే పాతిక ముప్ఫై వేల రూపాయల ఆదాయం. ఎంతో కష్టపడి సాధించుకొన్న 'లాటరీ' ఆదాయం లాంటిదది వాళ్లకి.

ఈ పరిస్థితిలో ఇప్పుడిది.

"ఉండు. ముందు కొంచెం టీ తాగు. తర్వాత మాట్లాడదాం" అని టీ కలిపి దానికో కప్పు ఇచ్చి నేనో కప్పు తీసుకొన్నాను. రోజూ 'టీ' లు కలిపి అందించే సీతాలు దాని కష్టం లేకుండా అందిన టీని అపురూపంగా తీసుకొని తాగడం మొదలుపెట్టి ఏడుపు మర్చిపోయింది. ఎంత సులువుగా కష్టాన్ని మర్చిపోగలిగింది? అనిపించి ఆ పిల్ల మీద ఆ క్షణంలో అసూయ కలిగింది.

గుంటూరు జిల్లాకు చెందిన నేను టీచర్ వుద్యోగం కోసం ఇంత దూరం వచ్చిపడ్డాను. పదేళ్లుగా ఇక్కడే ఉండిపోయాను. ఈ ఏజెన్సీ పల్లెటూళ్లకు ట్రాన్స్‌ఫర్ మీద ఎవరూరారు. అందుకని నాలాంటివాళ్లు పాతుకుపోయి ఉంటారు. మొదట్లో కష్టం అనిపించినా నెమ్మదిగా ఈ గాలికి, నీటికి అలవాటు పడిపోయాను. గాలిలోని శుచి, నీటిలోని శక్తి క్రమంగా తెలిశాయి. ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా మనసు ఇటే లాగుతుంది.

టీ తాగాక సీతాలు కప్పులు రెండూ తీసి కడిగేసింది నేను వారిస్తున్నా వినకుండా. పని అలవాటయిన వాళ్ల లక్షణం అది.

అప్పుడు చెప్పాను. "భూమిని అప్పజెప్పలేదు కదా! మనం కోర్టుకి పోయి స్టే తెచ్చుకోవచ్చు. కంగారు పడకు. గంగరాజుని రమ్మను. నేను మాట్లాడతాను," అన్నాను.

"అమ్మా! తల్లీ! ఈ రెక్కలు ముక్కలు చేసుకొని నీళ్లు మోసేం. బంగారంనాగ పంట కళ్లముందు అగుపిస్తోంది. కళ్ల ముందే సెయ్యి జారిపోకుండా సూడు తల్లీ," అని వెళ్లిపోయింది.

అయిదేళ్ల క్రితం కిష్ణమూర్తిరాజు పెళ్లాం ఇలాగే ఏడ్చింది. ఇలాగ కాదు... మింటికీ మంటికీ ఏకధారగా ఏడ్చింది. ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయి జబ్బు కొని తెచ్చుకొంది. ఆ సంగతంతా గుర్తొచ్చింది నాకు.

*

కిష్టమూర్తిరాజు పెళ్లి నాకు తెలుసు. నేను ఈ ఊరు వచ్చిన రెండేళ్లకి జరిగింది. ఈ వూరు ఏజన్సీ అడివి ఊరే అయినా ఆర్థికంగా చితికిపోయిన కొన్ని రాజ కుటుంబాలు ఈ వూళ్లో ఉన్నాయి. పోయిన సంపదతో ఆచారాలూ, సాంప్రదాయాలూ వదలలేక అష్టకష్టాలూ పడే వాళ్ల అమాయకత్వం, మూర్ఖత్వం చూస్తే నాకు ఎంతో జాలిగా ఉండేది. ఆడవాళ్లు చిన్నచిన్న ఘోషాలు పాటించేవారు. పరాయి మగవాళ్లకే కాదు తమ మగ వాళ్లకి కూడా కనపడకుండా ఉండాలని ప్రయత్నించే వారు. మాలాంటి ఉద్యోగస్తులంటే ఒక చులకన, ఒక కుతూహలం, లోలోపన ఆరాధన.

కిష్టమూర్తిరాజు భార్య కాపరానికి వచ్చిన రోజున పేరంటం పెట్టారు. నన్నూ పిలిచారు.

తాటాకుల చూరు కింద మట్టి అరుగుల మీద పేరంటం ఏర్పాటుచేశారు. అది పేరంటం కాదు. ప్రదర్శన. దాదాపు ఏభై చీరలు, కొంత స్టీలుసామాను, ఇత్తడి సామాను దగ్గర్నించి చెప్పుల జతలదాకా ఆ ప్రదర్శనలో ఉన్నాయి. అతి కొద్దిగా బంగారమూ, వెండీ కూడా వస్తువుల రూపంలో ఉన్నాయి.

సావిత్రిని బొమ్మలా అలంకరించారు. ఎంత అలంకరించినా ఆమె వయసు దాగడంలేదు. ముప్ఫై ఏళ్లు దాటాయి. బలమైన మనిషి. ఎత్తరి.

ఆ పేరంటం నాకు అప్పట్లో కొత్త. అందుకే వింతగా అనిపించింది. తర్వాత ఆ ఊళ్లో అలాంటి పేరంటాలు చాలానే చూశాను. ఆరోజు ఆ ఇంటి యువ రాణుల్లా కనిపించిన అమ్మాయిలు కొద్దిరోజుల్లో ఆ ఇంటి పనిమనుషుల్లా కనిపించేవారు. చిరిగిపోయిన జాకెట్లు, వెలిసిపోయిన చీరలతో. అయినా కొన్ని రోజుల పాటు నవనవలాడుతూ ఉండేవారు. కారణం తర్వాత తర్వాత వినగా తెలిసింది.

పుట్టింట్లో అందరూ తినడం తగ్గించుకొని పెళ్లి కోసం అని ఈ పిల్లలకి తిండి బాగా పెడతారట. ఆ విధంగా అలవాటు పడ్డ పిల్లలు అత్తవారింటికి వచ్చాక ఆ పరిస్థితులకి లొంగి, మొహమాటాలకి లొంగి ఎండి పోతారు.

సావిత్రి కూడా అలాగే ఎండిపోయింది. రకరకాల కారణాల వల్ల కూడా ఎండిపోయింది. పొడగరేమో ఎండి పోవడం వల్ల ఊగుతున్నట్లు నడిచేది.

మళ్లీ రెండు నెలలకి మరో పేరంటంలో ఆమెను చూశాను. వెలిసిన పాత పట్టుచీర, మెడలో సన్నని నానుతాడు, నల్లపూసల దండ.

పెళ్లి ప్రదర్శనలో పెట్టిన చీరలు, నగలూ అన్నీ ఎరువు తెచ్చినవని తెలిసింది. అదంతా మామూలేనట. అందరికీ తెలిసిన వ్యవహారమేనట.

మనుషులు తమని తాము ఎందుకింత తెలివి తక్కువగా మోసగించుకొంటారో! నాకు ఇదంతా హాస్యం గాకాక అపహాస్యంగా అనిపించింది. పెళ్లయిన రెండేళ్లకు కిష్టమూర్తిరాజు భార్య సావిత్రి మొదటిసారి నా యింటికి వచ్చింది. రాత్రి తొమ్మిది దాటాక చీకట్లో అరుగు మీద ఎవరో తచ్చాడడం చూసి నేనే బయటికి వచ్చాను. ఆమె... సందేహిస్తూ నిలబడి ఉంది.

చొరవగా లోపలికి తీసుకెళ్లి కూచోబెట్టాను. ఆమె తన ఘోషా పరదా దాటి ఇవతలికి రావడం నేను చూడగా ఇదే. ఏదో పెద్ద సంగతే ఉందనుకొన్నాను. కూచున్న మనిషి తలొంచుకొనే ఉంది.

"ఏమిటి సావిత్రీ! ఇలా వచ్చారు?" అన్నాను.

"మాకెవ్వరికీ చదువుల్లేవు. మా మొగాళ్లకి కూడా చదువులు లేవు. ఓ కాయతమ్ముక్క చదువుకోవడం రాదు. అలాగని చెప్పి మమ్మల్నిలా మోసగించడం తప్పు కాదా టీచరమ్మగారూ!" అంటూ బావురుమంది.

"ఏం జరిగింది? విషయమేమిటో చెప్పండి," అన్నాను. ఆవిడ నా ఇంటికి వచ్చి నా ముందు ఏడవడం ఏమిటో నాకు ఏమీ అర్థంకాలేదు.

తననితానే సంబాళించుకొని నెమ్మదిగా చెప్పింది. ఆమె చెప్పిన మాటలన్నీ కలిపి నాకు అర్థం అయింది ఇది. కిష్టమూర్తిరాజు పదెకరాలు పల్లం భూమి ఉందని చెప్పి సావిత్రిని పెళ్లి చేసుకొన్నాడు. అది మామూలే అని సావిత్రి సరిపెట్టుకోవలసి వచ్చింది. ఎందుకంటే ఉన్నది అయిదెకరాల మెట్టభూమి మాత్రమే. కనీసం అదేనా ఉందికదా అని ధైర్యం తెచ్చుకొంది. అందులో రకరకాల మెట్టపంటలు వేస్తున్నారు. నువ్వులు, కందులు... ఏ మాటకామాటే చెప్పాలంటే కిష్టమూర్తీ, అతని తమ్ముడూ, తండ్రీ కష్టపడి పొలంపని చేస్తారు. పంట అమ్ముకొని ఇల్లు జాగ్రత్తగా గడుపుకొంటారు. ఎవరిదో అయిదెకరాల పల్లం కౌలుకి తీసుకొని వరి పండిస్తు న్నారు. కానీ వర్షాధారం భూమి. రెక్కల కష్టానికి తగిన ఫలం రాదు.

ఇదంతా కాదు సావిత్రి నాకు చెప్పింది. ఇదంతా ఇంచుమించుగా నాకు తెలిసి ఉన్నదే. ఇప్పుడు ఆమె ఏం చెప్తోందంటే ఆ అయిదెకరాల మెట్టభూమినీ ప్రభుత్వం తీసేసుకుందని. అలా అని కాయితాలు చదివి గ్రామాధికార్లు తీర్పు చెప్పేసి రేపటి నుంచి పొలం లోకి రావద్దన్నారని.

ఇక్కడి భూముల గొడవలు నాకు తెలియవు. స్కూలు పిల్లలు కాక పల్లెటూరి రాజకీయాలు కొన్ని తెలుసు తప్ప మిగతా విషయాలు తెలుసుకొనే అవ సరం రాలేదు. అందుకే నాకు ఈ అమ్మాయి మాటలు అర్థం కాలేదు.

"మీ పొలం గవర్నమెంటు ఎందుకు తీసుకుం టుంది? అదేం న్యాయం?" అన్నాను ఆమెతో. ఆమెకు కూడా వివరంగా తెలియదనుకుంటాను. అందుకే ఆ ఏడుపు. చివరికి ఆమె అన్న మాట ఇది.

"మీరు రేపు గ్రామాధికారి ఇంటికి వెళ్లి ఆ కాయి తాలు చదివి అందులో ఉన్న నిజం ఏమిటో చెప్పాలని మా రాజుగారు మీ దగ్గరకి పంపారండి. మాకు ఆ సహాయం చేసి పెట్టేవారు మీరు తప్ప ఎవ్వరూలేరు ఈ ఊళ్లో," అని నన్ను బతిమాలి ఇంటికి వెళ్లింది ఆ చీకట్లో.

ఈ మాత్రం దానికి నన్ను బతిమాలక్కర్లేదు. కాని ఆమె ఉన్న పరిస్థితిలో ఆమెకు ఈ మాత్రం సహాయమే కొండంతగా ఉందన్నమాట.

మర్నాడు గ్రామాధికారి నుంచి నాకు తెలిసిన సమాచారం చాలా ఆశ్చర్యంలో ముంచింది నన్ను. ఆ సాయంత్రం సావిత్రి ఇంటికి వెళ్లాను చెప్దామని.

కిష్టమూర్తిరాజు గుమ్మం ముందు కూర్చుని ఎండుగడ్డితో తాడు పేనుతున్నాడు. అతని తండ్రి నులక

మంచంలో తెగిన తాళ్లు ముడివేస్తున్నాడు. సావిత్రి లోపల ఉన్నట్టుంది. నన్ను చూడగానే ఇద్దరూ వాళ్లు చేస్తున్న పని మధ్యలో వదిలేసి సావిత్రిని పిలుస్తూ, నాకు కుర్చీ వేసి, వాళ్లు మాత్రం అరుగు మీద కూర్చున్నారు.

చదువుకి ఇంత గౌరవం ఉందన్నమాట అనిపించింది ఒక్కసారిగా. కానీ నేను చెప్పే సమాచారానికి వీళ్లు ఎలా స్పందిస్తారో అని కొంచెం దిగులుగా కూడా అనిపించింది.

''మీరు ఆ పొలం ఎవరి దగ్గర కొన్నారు?'' అన్నాను.

''ఫకీర్రావు అని హరిజనవాడలో ఉన్నాడు కదా. వాళ్ల నాన్న అమ్మితే కొన్నాం ఇరవయ్యేళ్ల క్రితం,'' అన్నాడు పెద్ద రాజు.

''మీకు తెలుసోలేదో! ఇక్కడ ఒక రూల్ ఉందిట. గిరిజనులు కానివాళ్లకు ఇక్కడ భూములు ఉండకూడదని. ఆ విధంగా మీ భూమిని ప్రభుత్వం తీసేసుకుంది.''

''ఏంటి టీచరమ్మా! ఆ మాట. మేమూ ఇక్కడ ఏభై ఏళ్ల నుంచి ఉంటున్నాం. ఈ కొండల్ని, ఈ భూముల్ని నమ్ముకుని. మేం పైవాళ్లం ఎలా అవుతాం?''

ఆయన మాటల్లో కొంత న్యాయం కనిపిస్తోంది కానీ ఈయన నాగరికమైన కులం నించి వచ్చినవాడు. గిరిజనుడెలా అవుతాడు. ఇక్కడి భూములన్నీ న్యాయంగా గిరిజనులవే. ఎప్పటికేనా వాళ్లకే చెందాలిట. అదీ కరణంగారు చెప్పిన మాట. అదే చెప్పాను.

''ఇప్పుడు మేం ఏం చెయ్యాలి? కోర్టు కెళ్తే న్యాయం ఏమయినా జరుగుతుందా?'' అని కిష్టమూర్తి అడిగాడు.

''ప్రభుత్వానికి వ్యతిరేకంగా మీరు కోర్టుకి వెళ్లాలి. రూల్‌కి వ్యతిరేకంగా వెళ్లాలి. నెగ్గగలరా? ఆలోచించండి,'' అని చెప్పి వచ్చేశాను.

సావిత్రిని కలవాలనిపించలేదు. ఆమె కన్నీళ్లు మళ్లీ చూడలేను. ఎరువుచీరలు, నగలతో సావిత్రి, అబద్ధపు పొలంతో కిష్టమూర్తి ఒకరిని ఒకరు మోసగించుకుని పెళ్లి చేసుకున్నారు. అబద్ధాలు బయటపడినా ఒకరినొకరు అసహ్యించుకోకుండా సానుభూతి చూపించుకోగలుగుతున్నారు.

నాకు వింతగా అనిపించింది. ఇంటికి వచ్చేశాను. ఆరునెలలు ఆ విషయాలు ఆనోటా, ఈనోటా వింటూనే ఉన్నాను. కానీ సావిత్రి వచ్చి భోరుభోరుమని ఏడ్చిన దాకా వివరాలు తెలియలేదు.

కిష్టమూర్తి పట్టుదలగా కోర్టులో కేసు పెట్టాడట. కేసు కొట్టేశారు. దానికోసం సావిత్రి మెడలో నానుపేట మాయమయింది. అదొక్కటే ఆ అమ్మాయి ఆస్తి. అన్నగార్లు పెట్టినది. అదీ అమ్మేశారు. అంతేకాదు సీతాలు అనే గిరిజన యువతికి ప్రభుత్వం ఆ అయిదెకరాల మెట్టభూమినీ పట్టాగా ఇచ్చేసింది.

సావిత్రి భోరుమని ఏడ్చింది. ఏడుస్తూ చెప్పింది. చెప్తూ ఏడ్చింది. తరువాతి దినాల్లో ఆమె ఆ ఊళ్లో అగ్రవర్ణాల ఇళ్లలో పప్పు రుబ్బేది. ధాన్యం దంపేది. వడియాలు పెట్టేది. మరెన్నో చిల్లరమల్లర పనులు చేసేది. చంటిపిల్లలతో చాకిరీతో జబ్బుపడింది. బలమైన తిండి కావలసిన 'జబ్బు' పడింది ఆమె.

కిష్టమూర్తిరాజు నా కళ్ల ముందరే వ్యవసాయకూలీ అయిపోయాడు. తండ్రి మనోవ్యాధితో మంచానపడ్డాడు. తమ్ముడు లారీ క్లీనరుగా తిరుగుతున్నాడు. ఇంట్లో ఇద్దరు చంటిపిల్లలు. జారిపోతున్న రాచమర్యాదలు పూర్తిగా శిథిలమయిపోయాయి. పాడుపడిన మట్టి అరుగులతో జీర్ణమయిన తాటాకుల ఇల్లు ఆ దారిన వెళ్తుంటే నన్ను గాభరాపెడుతూ ఉంటుంది. ఒక సాయంత్రం ఆ ఇంటి ఆరుగుల మీద చేసిన పెండ్లి వస్తువుల ప్రదర్శన ఒక కలలాగా అనిపిస్తూ ఉండి కలవరపెడుతూ ఉంటుంది.

ఇప్పుడు మళ్లీ సీతాలు ఏడుపు. ఆ అయిదెకరాల భూమిని సీతాలు పేరు మీదుగా గంగరాజు పట్టా సంపాదించాడు.

గంగరాజు గిరిజనుడు కాదు. సీతాలుని ఉంచుకొన్నాడు. సీతాలు గిరిజన స్త్రీ కాబట్టి ఆమె పేరుతో పట్టా సంపాదించాడు. గిరిజనుల పేరుతో గిరిజనేతరులు భూములు సంపాదించి, ఆక్రమించుకుని, సాగు చేసుకునే 'బినామీ' పద్ధతన్నమాట.

ఏది ఏమయినా సీతాలూ, గంగరాజూ ఇద్దరూ కలిసే తోటపని చేసుకున్నారు. ఇది మళ్లీ ఫకీర్రావు చేతుల్లోకి వెళ్లబోతోందన్నమాట.

మర్నాడు ఆదివారం. ఊరు వెళ్లవలసిన పని వుంది. కానీ ఆ పని మానేశాను. ఈ సీతాలు వ్యవహారం ఏమిటో తెలుసుకోవలసిన అవసరం ఉందనిపించింది.

తిన్నగా మాలపల్లి ఫకీర్రావు ఇంటికి వెళ్లాను. ఫకీర్రావు పెళ్లాం చేపలు బాగు చేస్తోంది. వాకిట్లో పీట వేసుకుని కత్తి పీట ముందు కూచుని ఉంది. బూడిదలో పొర్లించిన చేపలు కదుల్తున్నాయి. నన్ను చూసి గబగబా ఆ చేతులు కొంగుకి తుడిచేసుకుని మరో పీట తెచ్చి

వేసింది. నా రాకకి కొంచెం ఆశ్చర్యపోయినట్టు ఉంది మొగం చూస్తే.

నన్ను ఎలా మర్యాద చెయ్యాలో తెలీక - కొంచెం కంగారుపడుతూ, టీ పెట్టి తెస్తానని లోపలికి వెళ్లబోయింది.

"ఒకసారి ఇలా వచ్చి కూచో. నీతో మాట్లాడాలి," అని పిలిచి బలవంతంగా కూర్చోబెట్టాను.

"ఫకీర్రావు ఇంట్లో లేడా? నువ్వు ఏం చేస్తున్నావు? పిల్లలు ఏం చేస్తున్నారు?" అన్నాను.

"ఆడెప్పుడూ ఇంటి కాడుండడమ్మా. సాయంత్రం సరేసరి. రోజు తాగే వస్తాడు. పిల్లలిద్దర్నీ హాస్టల్లో వేసేం," అంది. అని ఈ ఇల్లు నేనే సాకుకుని రావాల. మాలాం టోళ్లకి పాచిపనులు కూడా దొరకవు. కూలిపన్లోకి ఎళ్తే రోజు గడుస్తుంది. కాని రోజు పస్తే," అంటూ మొహమాటంగా చేపల కేసి చూసింది.

"ఫర్వాలేదు రాములమ్మా. నీ పని చేసుకుంటూనే చెప్పు," అంటూ ఆమెని పనిలోకి పంపాను.

ఆమె చేపలు కోస్తుండగా అడిగాను.

"ఈ భూమి సంగతేవిటి? ఫకీర్రావు పిటీషను పెట్టేడట. నీకేమయినా తెలుసా!" అన్నాను. తరిగే చేపని మధ్యలో ఆపేసి, "మీకెలా తెలిసిందమ్మా ఈ విషయం?" అంది.

"చెప్తాను గానీ, అసలు విషయమేమిటి చెప్పు," అన్నాను.

"ఏం చెప్పనమ్మా! ఆ భూమి ఈ దేశం వచ్చినప్పుడు ఎప్పుడో మా మావ కొన్నాడట. మా ఆయన చిన్నతనంలో ఆ పొలంలోనే ఆడుకొన్నానని చెప్తాడు. మా మావ మా అత్తకి జబ్బు చేసినప్పుడు ఆసుపత్రులకి, మందులకి డబ్బు చాలక ఆ పొలం రాజులికి అమ్మేసాడు. అది అలాగ సేతులు మారిపోయింది," అని చెప్తూ రాములమ్మ నాకొక కొత్త సంగతి చెప్పింది.

వాళ్లని మొన్న మొన్నటిదాకా ఎస్. సి.లనే అనేవారట. ఎస్.సి.లు గిరిజనులు కాదుట. అంచేత వాళ్లకి భూములు లేవు. ఇప్పుడు మళ్లీ అందులో వాల్మీకులు గిరిజనులని తెలిసింది. కొత్త ఆఫీసరు ఫకీర్రావుకి 'వాల్మీకి సర్టిఫికెట్' ఇస్తానన్నాడట. ఏదో ఒక రేటు పెట్టేడట.

నాకు విషయం చాలావరకూ అర్థం అయింది. ఇప్పుడు ఫకీర్రావు ఆ ఆఫీసరు దయవల్ల వాల్మీకి కులస్థుడు అవుతాడు. గిరిజన సర్టిఫికెట్ వస్తుంది. రావడమేమిటి. వచ్చే ఉంటుంది. దాంతో సీతాలు భూమి ఆమెది కాదని గంగరాజుదనీ ఆమె బినామీ అనే కేసు పెట్టాడు. ఇంత తెలివి ఫకీర్రావుకి ఎక్కడిది?...!! "ఏంటి టీచరమ్మా! ఆ భూమి మళ్లీ మాకొస్తుందా?" అని అమాయకంగా అడుగుతోంది రాములమ్మ.

"ఆ భూమి సెక్క మళ్లీ మాదయితే నా రెక్కల కట్టం తగ్గుతుంది తల్లీ. పిల్లలు కాస్త సుకంగా తిని సదూకుంటారు. అదయినా నా మొగుడు తాగుడుకి మళ్లీ ఎవరికో 'తనకా' పెట్టకుండా ఉంటేనేలే తల్లీ" అని తన గోడు చెప్పుకోవడం మొదలుపెట్టింది.

ఈ భూమి పేరు చెప్తే మట్టిగొట్టుకుపోయి, బక్క చిక్కిన ఇద్దరు చంటిపిల్లలు, క్షయవ్యాధితో తీసుకునే సావిత్రీ గుర్తొస్తున్నారు.

"వస్తాలే రాములమ్మా! మళ్లీ వస్తాను," అని చెప్పి వచ్చేశాను.

రాములమ్మకి, సీతాలు ఏడుపు, సావిత్రి దు:ఖం చెప్తే అర్థం అవుతాయా? అయితే మాత్రం ఏం చేస్తుంది? అనిపించింది.

వారంరోజుల తర్వాత సీతాలు వెంట కోర్టు నుంచి 'స్టే' తెచ్చుకోడానికి లాయర్ దగ్గరికి పట్నం వెళ్లేను. తిన్నగా లాయరుగారింటికి వెళ్లేం.

ఇంటి చుట్టూ అరుగుల మీద, గేటు బయటా, రోడ్డు మీదా జనం. ఇంచుమించుగా మా ఊళ్లోవాళ్లే అంతా. గిరిజనులు, గిరిజనేతరులు. లోపలికి వెళ్లి కనిపించి చెప్పేం వచ్చేమని.

"మీరెందుకొచ్చేరు?" అన్నాడు నన్ను.

"నాకు వేరే పని ఉంది. సీతాలుకి సహాయంగా కూడా ఉండొచ్చని" అన్నాను.

"సరే. మీ పని చేసుకురండి. ఆ 'కొండది' ఇక్కడుంటుంది," అన్నాడు. నాకు మనసు చివుక్కుమంది.

"సాయంత్రం ఆఖరి బస్కైనా మేం తిరిగి వెళ్లగలిగేలా చూడండి," అని చెప్పి సీతాలుని అక్కడ వదిలి నా పని మీద నేను వెళ్లేను.

సాయంత్రం తిరిగి లాయరుగారింటికి వెళ్లేసరికి సీతాలు మొహం వాడిపోయి ఉంది. మధ్యాహ్నం తిండి లేదు.

"మళ్లీ వారం రమ్మన్నారండి అయ్యగారు. మధ్యాహ్నం ఎక్కడ్నించో కబురొచ్చిందని అర్జంటుగా వెళ్లిపోయారు." అంది.

ముందు ఆ మనిషిని తీసుకెళ్లి ఎక్కడో చోట నాలుగు ఇడ్లీలు తినిపించేదాకా నాకు తోచలేదు.

"అమ్మయ్య! బతికాను," అంది. ఇడ్లీలు తిన్నందుకు కాదు. మధ్యాహ్నం నించీ ఎంతో అవసరంగా

'బయటికి' వెళ్లవలసి ఉందిట. ఆ లాయర్ ఇంట్లో ఆ వీలులేదు. ఇంటి పరిసరాల్లో కూడా లేదు. చాలా ఇబ్బందిపడిపోయి ఉగ్గబట్టుకుని కూర్చుందట. బస్ స్టాండ్‌కి వెళ్లగానే ముందు బాత్‌రూంకి వెళ్లి వచ్చి ఆ తర్వాత ఆ మాట అంది. ఆడవాళ్ల ఇలాంటి ఇబ్బందులు కూడా ఎవరికి కావాలి?

బస్‌లో చెప్పింది. మళ్లీ వారం వచ్చేటప్పుడు నన్ను వెంట తీసుకు రావద్దన్నాడట లాయర్‌గారు. "ఒక్కసారి చూసేవుగా ఒక్కదానివే రావడం అలవాటు చేసుకోవాలి. చాలాసార్లు రావాల్సి ఉంటుంది," అని. అంతేకాదు "రెండువేలు ఖర్చవుతుంది. 'స్టే' ఆర్డరు రావడానికి. మళ్లీసారి తీసుకునిరా" అని.

*

మూడు నెలలయినా ఏ సంగతీ తేలలేదు. సీతాలు లాయరు దగ్గరికి రెండుసార్లు వెళ్లి రెండు వేలూ ముట్టజెప్పింది. స్టే ఆర్డరు తెచ్చుకుని తాత్కాలికంగా భూమి ఫకీర్రావుకి పోకుండా ఆపుకోగలిగింది కానీ ఆ మాత్రానికి అయిదువేలు అప్పు చేసింది. మధ్యవర్తులు కూడా రకరకాలుగా ముడుపులు మింగేరు.

అప్పు ఎంత వడ్డీకి తెచ్చిందో, ఎక్కడ నించి తెచ్చిందో దేవుడిక్కూడా తెలియడం కష్టం. జీడిమామిడి తోట చూసి ఇచ్చుంటారు.

మరి ఫకీర్రావు ఎక్కడ తెచ్చిఉంటాడో వాల్మీకి సర్టిఫికెట్ పుట్టించడానికి అనుకొన్నాను. బహుశ అతనూ ఆ తోటే చూపించి ఉంటాడేమో!

ఒక మధ్యాహ్నం చిన్న పని మీద స్కూల్ నించి ఎమ్మార్వో ఆఫీసుకి వెళ్లవలసి వచ్చింది. పది కిలోమీటర్ల దూరంలో ఉంది మండల కేంద్రం. అక్కడ ఆ ఆఫీసులో మా గుంటూరు ముఖం కనిపించింది. నా చిన్నప్పటి క్లాస్‌మేటు, దూరపు బంధువు కూడా. వెళ్లి పలకరించాను. ఆరు నెలలయిందిట వచ్చి. ఇక్కడే పని చేస్తున్నాడట. మామూలు కబుర్లయాక సీతాలు సంగతి అడిగాను. అతను నాకేసి ఆశ్చర్యంగా చూసేడు.

"ఇన్ని ఏళ్ల నుంచి ఉంటున్నావు. ఇంత చిన్న సంగతి తెలీదా," అన్నాడు.

"ఏమిటి, ఇందులో విషయం?" అన్నాను.

"ఫకీర్రావు ఎస్.టి. కాదు. ఆ విషయం తెలుసా! ఇక్కడికి విశాఖజిల్లా వలసవచ్చిన ఎస్.సి.లే వాల్మీకులు అవుతారు. గోదావరి జిల్లాల నుంచి వచ్చిన ఎస్.సి.లు అలా కాదు. ఫకీర్రావు తాత ముత్తాలు గోదావరి జిల్లాల నుంచి ఈ ఏజెన్సీకి వలస వచ్చినవాళ్లు. కానీ ఆ సంగతి దాచి అతన్ని మేం ఎస్.టి.ని చెయ్యగలం. కానీ చెయ్యం. చేస్తామని తిప్పుతాం. లేదా చేసి కోర్టులో పొలం కోసం దావా వేయిస్తాం. సీతాలుకి, ఫకీర్రావుకి మధ్య కేసు నడుస్తూ ఉంటుంది. తోట ఎవరికీ చెందదు. త్రిశంకు స్వర్గమంటారు చూడు. అక్కడ ఉంటుంది. లాయర్లకి, మాకూ జేబులు నిండుగా ఉండాలంటే ఇలాంటి కేసులు మరికొన్ని రావాలి కదా మరి. తోటలో జీడిమామిడి గింజలు డబ్బులుగా మారి మా జేబుల్లోకి చేరడానికి ఇదో నాటకం," అని విశదీకరించాడు.

నేను తెల్లబోయాను. "మేం అంటే ఎవరూ?" అన్నాను.

"అది అడగకూడదు నువ్వు. అది ఒక భూతం. దానికి తలలేదు. హృదయం సరేసరి. తోక కూడా లేదు. కడుపు మాత్రమే ఉంది. అమితమైన ఆకలితో, ఆ కడుపుకి ఎంత పోసినా చాలదు," మిస్చివస్‌గా నవ్వుతూ అన్నాడు.

"అయితే తోట సీతాలుకి అప్పచెప్పరా" నా కంఠంలో నీరసం నాకే వినిపించింది.

ఏడుపు మొహంతో సీతాలు నా కళ్లముందు మెదిలింది. బూడిద చేతులతో రాములమ్మ కళ్లలో ఆశ మెరవగా నాకేసి చూస్తున్నట్టుగా అయింది.

"ఇంతా విన్నాక అమాయకమైన ప్రశ్న అడుగుతావా? దేవుడు దిగి రావాలి అప్పజెప్పడానికి," అన్నాడు.

సీతాలు లాయరు చేతికిచ్చిన ఎస్.టి. సర్టిఫికెట్‌ని లాయరు కోర్టులో దాఖలు చేయలేదు. ఈ సంగతి సీతాలుకి ఇప్పటికీ తెలీదు.

కానీ తరువాతి కాలంలో గంగరాజు మాత్రం సీతాలుని వదిలేశాడు. పాక హోటల్‌లోంచి కూడా బయటికి పంపేసాడు. సీతాలు నాలుగు ఇళ్లల్లో పాచి పనికి కుదిరింది. ఒంటిమీద ఉన్న కాస్త బంగారమూ అమ్మేస్తే తప్ప అప్పులు తీరలేదు. ఫకీర్రావు పగలు కూడా తాగి హరిజనవాడ రోడ్ల మీద పడుంటున్నాడు. పిల్లలు పరీక్ష తప్పి హాస్టలు నించి ఇంటికొచ్చేశారు. రాములమ్మ పిల్లల్ని కూలిపనిలోకి తీసుకుపోతోంది.

లాయర్‌గారు కాంపౌండ్‌వాల్‌కి రెండువైపులా సిమెంటు అరుగులు కట్టించాడు, గిరిజన క్లయింట్లు కూర్చోడానికి. రెండో అంతస్థు వేసే హడావిడిలో క్లయింట్లని ఎక్కువసేపు కూచోపెట్టక తప్పడంలేదు పాపం ఆయనకి.

"ఇదీ జీడిమామిడితోట కథ," అన్నాను పద్మినితో. ఆమె అంతా ఆశ్చర్యంగా వింది.

“మరి ఇందులో గిరిజనులు- గిరిజనేతరుల మధ్య ఉన్న భూమి తగాదా అన్న అంశానికి నాకు సబ్జెక్టు ఏదీ?” అంది.

“నీ యు.జి.సి. ప్రాజెక్టువర్క్ సంగతి అలా వుంచు. తెలివయినవాడు ఎదుటివాడిని రకరకాలుగా దోచుకోవడమే ఉంది ఇక్కడ కూడా. ఆ ఎదుటివాడు గిరిజనుడేనా కావొచ్చు. గిరిజనేతరుడైనా కావచ్చు. ఇద్దరూ సమానంగా మోసగించబడి దోపిడీకి గురి అవడమే నేను ఇక్కడ చూస్తున్నది.

“అయితే ఇది ఇళ్లలో ఆడవాళ్ల మీద మరింత హింసగా మారుతోంది.

“సీతాలుని గంగరాజు పెళ్లిచేసుకుని ఉంటే కథ ఇంకొకలా ఉండేది. వాడు చేసుకోడు. వాడికి పెళ్లి, పెళ్లాం, పిల్లలూ ఉన్నారు. కేవలం భూమి కోసమే వాడు దాన్ని ఉంచుకున్నాడు.

“నువు ఏమయినా రాసుకో నీ ప్రాజెక్ట్‌వర్క్‌కి. కానీ లోకంలో ఉన్న దమననీతే ఇక్కడా రాజ్యంచేస్తోంది. చదువుకోవాలి వీళ్లంతా. చదువు ఒక్కటే పరిష్కారమార్గం అనిపిస్తోంది నాకు,” అన్నాను.

చీకటి పడుతుండగా ఆలోచనల్లో మునిగిన సోషియాలజీ రీడర్ పద్మినిని ఇంటికి తీసుకువచ్చాను.

ఆ రాత్రి ఆమె నన్ను ఇంకేమీ ప్రశ్నించలేదు. తెలతెలవారుతుండగా నన్ను నిద్రలేపింది. రాత్రి చాలా ఆలస్యంగా నిద్రపట్టిందట. ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత నిద్రట ఆ నిద్ర.

“నాకు ఈ రోజు ఆ ఆడవాళ్లని చూపించు. నేను వాళ్లందరి కోసం ఏదో ఒకటి చేయాలని నిశ్చయించుకున్నాను. ఇంక చదివిన చదువూ, రాతకోతలూ పక్కన పెడుతున్నాను,” అంది.

పద్మిని స్థిర నిశ్చయశక్తి నాకు తెలుసు. ఈ ఉదయం ఎంతో బావుందనిపించింది,

*ఈ కథకు సంబంధించిన సమాచారం అందించిన మా నాన్నగారు
శ్రీ వాడ్రేవు విశ్వేశ్వర వెంకటచలపతిగారికి నా కృతజ్ఞతలు.*

*మాభూమి, 5 ఫిబ్రవరి 1999*